కథ

# తీర్థయాత్ర

చిట్టిపెద్ది ఉమ

**వెంకట్రామయ్య పొద్దున్న, సాయంత్రం మునిసిపల్ పార్కులో అడుగుపెట్టాడంటే చుట్టుప్రక్కల జనాలంతా వాచీలు దిద్దుకుంటారు. పొద్దున్న సరిగ్గా అయిదున్నరకి, సాయంత్రం ఆరు గంటలకి పార్కులో అడుగు పెట్టడం, పన్నెండేళ్ళుగా ఇంచుమించు ఇది ఆయన దినచర్య. ఏ కాలమైనా సరే ఆయన అలవాటు మారదు. ఎప్పుడో ఒంట్లో మరీ బావుండనప్పుడు, ఊళ్ళో లేనప్పుడు తప్ప, పార్కుని చుట్టి ఉన్న సన్నటి కాలిబాట మీద ఆయన ఫాస్ట్ వాకింగ్ చేస్తూంటే, ఆయన వయసులో సగం వయసు ఉన్నవాళ్ళు ఆయనని ఆరాధనగా చూస్తూ, ఆయనతోపాటు సమంగా నడవలేక రొప్పుతూ, ఆయాసపడుతూ ఓ రౌండ్ ముగించి కూలబడిపోయేవాళ్ళు నీరసంగా.**

''ఏమండీ..వెంకట్రామయ్యగారూ.. ఈమధ్య మీ వాకింగ్ స్పీడ్ తగ్గినట్టుందే'' పార్కుకి తరచూ వచ్చే పరమేశ్వరయ్య పలకరించాడు.

''వయసయిపోతోందిగా..ఓల్డ్ మిషన్ ఎన్నాళ్ళు పనిచేస్తుంది చెప్పండి'' వెంకట్రామయ్యగారి మాటలకి పకపకా నవ్వాడు పరమేశ్వరయ్య. పరమేశ్వరయ్య పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు. ఇంకా మూడేళ్ళ సర్వీసుంది ఆయనకి. ''భలేవారండీ...మిమ్మల్ని చూసి ఊళ్ళో సగం మంది శరీరాన్ని ఆరోగ్యంగా ఎలా ఉంచుకోవాలో నేర్చుకుంటున్నారు'' వెంకట్రామయ్య చిరునవ్వు నవ్వి ముందుకి నడుస్తున్నా ఆయన మనసులో ముందు రోజు సాయంత్రం కోడలి మాటలు ముల్లులా మెదిలాయి.

''నాకు కుదరదు అమ్మా..సర్లే..ఈ ముసలాడి బాధ మా ఆయన రిటైరైనా నాకు తప్పేట్టు లేదు. ఉక్కుపిడుగులా ఉన్నాడు. ఆయన నడిచినంత ఫాస్ట్‌గా, ఆయనంత యాక్టివ్‌గా మా ఆయన కూడా లేరు. నాకు కుదరదుకానీ ఎంగేజ్‌మెంట్ రోజు పొద్దున్నే వస్తాను. ఉంటామరి'' హేమ వాళ్ళమ్మతో మాట్లాడుతోంది. మామగారు ఇంకా రాలేదనుకుంది.

అప్పుడే వరండాలో అడుగుపెట్టిన వెంకట్రామయ్యగారిని చూడలేదు హేమ. అయినా అప్పుడప్పుడు ఇలాంటి సూటిపోటీ మాటలకి అలవాటు పడిపోయాడు వెంకట్రామయ్య. గవర్నమెంట్ యాభై అయిదేళ్ళకే ఇంటికి పొమ్మని బలవంతంగా రిటైర్ చేసిన వాళ్ళల్లో వెంకట్రామయ్య ఒకడు. ఆరోగ్యంగా ఉండి పనిలేకుండా కూర్చోవడం ఎంత నరకమో అనుభవించే వాళ్ళకే తెలుస్తుంది. ఆర్థికంగా ఓ మోస్తరుగా మెరుగ్గానే ఉన్నా తిని ఇంట్లో కూర్చోవడం నరకప్రాయంగానే అన్పించింది. నిరుద్యోగ సమస్య దారుణంగా ఉన్న ఆ రోజుల్లో వెంకట్రామయ్యకి మళ్ళీ ఇంకో ఉద్యోగం దొరకలేదు ఎంత వెతికినా..వెతికి, వెతికి వేసారి ఇక ఆ ప్రయత్నమే మానుకున్నాడు. గవర్నమెంట్ నువ్వు ముసలాడివైపోయావు 'కృష్ణా-రామా' అనుకునే వయసు వచ్చేసింది నీకు అన్న ముద్ర వేసినప్పుడు ప్రయివేట్‌లో ఎవరు తీసుకుంటారు. వెంకట్రామయ్య చేసింది ఎకౌంటెంట్ ఉద్యోగం. ట్యూషన్లు చెప్పుకోవడానికి కూడా పెద్దగా వీలులేని సబ్జెక్ట్. అదీకాకుండా వెంకట్రామయ్యకి టీచ్ చెయ్యడం రాదు. పెద్దగా ఇష్టమూ లేదు టీచింగ్ పట్ల. భార్య భానుమతి వెనకాల ఇంటిపనులు చేస్తూ..సాయంత్రాలు బజారుపన్లు చేస్తూ..మధ్యాహ్నం నిద్ర, టీవీలతో రెండేళ్ళు గడిపారు. భానుమతి మరణంతో వెంకట్రామయ్య పరిస్థితి కుడితిలో పడ్డ ఎలకలా అయింది. విడిగా ఊళ్ళోనే ఉంటానన్నా కొడుకు మహేష్, బంధువులు అందరూ బలవంతపెట్టి పల్లెటూర్లో ఇల్లు అమ్మించేశారు. అప్పట్నుంచీ మహేష్‌తోనే ఉంటున్నాడు ఆయన. హేమ మొదట్లో మామగారిని బాగానే చూసుకున్నా, రాను రాను ఓ గదిని ఆక్రమించుకున్న పనికిరాని పాత సామానైపోయాడు. మనవలిద్దరూ పెద్దవాళ్ళైపోయారు. వాళ్ళ వ్యాపకాల్లో వాళ్ళు బిజీ. ఒంతరితనం దహిస్తుంటే ముసలితనం శాపం అని ఎందుకంటారో అర్థమవుతోంది ఆయనకి. 'వానప్రస్థం' అని కొన్ని చోట్ల చక్కటి ఆశ్రమాలు ఉన్నాయి. వయసుమళ్ళిన వాణ్ణని అక్కడికి వెళ్ళి ఉంటానంటే మహేష్ చాలా నొచ్చుకున్నాడు. నిష్ఠూరమాడాడు కూడా. హేమ కూడా నొచ్చుకుంది చాలా. వాళ్ళు నొచ్చుకోవడంలో తన క్షేమం, ఆనందం కంటే సమాజం ఏమనుకుంటుందో అన్న భయం ఉంది. పొద్దున్న, సాయంత్రం ఇలా పార్కుకి వచ్చినప్పుడే ఊపిరి ఆడుతున్నట్టు ఉంటుంది. కొంత వ్యాయామం. కాస్సేపు తెలిసినవాళ్ళతో కాలక్షేపం.

''వెంకట్రామయ్యగారూ..మేం నలుగురం కలిసి అమర్‌నాథ్ యాత్ర, వైష్ణవిదేవి యాత్ర చేసి రావాలనుకుంటున్నాం. మీరూ వస్తారా?'' పరమేశ్వరయ్య తన వాకింగ్ ముగించి వెంకట్రామయ్యగారి పక్కన బెంచి మీద కూర్చుంటూ అన్నాడు.

''యాత్రా..'' వెంకట్రామయ్య అనీజీగా కదులుతూ అన్నాడు. వెంకట్రామయ్యకి తను నాస్తికుడో, ఆస్తికుడో తెలియదుకానీ ఆయన ఏనాడూ తనంత తానుగా గుళ్ళకి వెళ్ళలేదు. భార్య ఉన్నప్పుడు తప్పనిసరిగా ఆవిడతో వెళ్ళాల్సి వచ్చినప్పుడు..పిల్లల కోసం భానుమతి మొక్కుకున్నప్పుడు తప్ప..ఏ దేవుడికీ ఏనాడూ మొక్కుకోనూ లేదు. ఆడపిల్లల పెళ్ళిళ్ళల్లో, పేరంటాల్లో పూజలు చేయాల్సి వచ్చినప్పుడు చేశారు..చేయించాడు తప్ప ఆయనలో భక్తిభావం ఏనాడూ లేదు. వెంకట్రామయ్యగారిని బాగా తెలిసి ఉన్నవాళ్ళైతే యాత్రకి వస్తారా అని అడిగి ఉండేవాళ్ళు కాదు. చటుక్కున ఏదో స్ఫురించింది వెంకట్రామయ్యగారికి ''అమర్‌నాథ్ యాత్రకి చాలా రిస్ట్రిక్షన్స్ ఉన్నాయిలా ఉంది..హెల్త్..వయసు..''

''అదేం ప్రాబ్లం కాదు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ అన్నీ అందరం కలిపి ఒకేసారి తీసుకుందాం'' పరమేశ్వరయ్య యాత్రకి కావాల్సిన సరంజామా, అయ్యే ఖర్చు అవీ వివరంగా వివరించాడు. వెంకట్రామయ్యకి యాత్ర వివరాలు, ప్రయాణంలో ఎదుర్కోవాల్సిన సమస్యలు వింటుంటే పెదవులమీద చిన్న చిరునవ్వు మెరిసింది.

''మహేష్..నేను అమర్‌నాథ్ యాత్రకి వెళ్దామనుకుంటున్నాను'' రాత్రి వెంకట్రామయ్య మహేష్‌తో అంటుంటే మహేష్, హేమ ఆశ్చర్యంగా చూశారు. మహేష్‌కి తెల్సినంతవరకూ వెంకట్రామయ్యగారు ఎప్పుడూ తనంతతానుగా గుళ్ళకి వెళ్ళలేదు. దగ్గర్లో ఉన్న తీర్థస్థానాలకి కూడా ఎప్పుడూ వెళ్ళలేదు. అలాంటిది ఇప్పుడు యాత్ర..అదీ ఎంతో రిస్కుతో ఉన్న అమర్‌నాథ్ యాత్ర.

''జమ్మూ, శ్రీనగర్ వైపు ప్రకృతి స్వర్గంలా ఉంటుందంటారు. ఒక్కసారి చూస్తే జన్మ తరించి పోతుందంటారు. ఇక్కడ నుంచి నాకు

తెల్సినవాళ్ళు వెళ్తున్నారు. నన్ను కూడా రమ్మంటున్నారు. అందుకే నేను కూడా వెళ్దామనుకుంటున్నాను'' వెంకట్రామయ్య వివరించాడు.

'హే భగవాన్ నువ్వంటూ ఉంటే నా జన్మ నిజంగా తరించి పోయేలా చేయి' మనసులోనే అనుకున్నాడు.

''తప్పకుండా వెళ్ళండి. కానీ అక్కడ మిలిటెన్సీ..టెర్రరిస్టుల బెడద ఉంది. వాతావరణం కూడా విపరీతంగా ఉంటుంది. కొండలు..లోయలు..ఎంతో దూరం నడవాలి. ప్రయాణం చాలా కష్టం..అడుగడుగునా పొంచి ఉండే ప్రమాదాలు..''

వెంకట్రామయ్య గుంభనంగా నవ్వుకున్నాడు. ''అందుకే వెళ్తున్నది. ఈరోజుల్లో చాలా సౌకర్యాలు ఉన్నాయిరా. గుర్రాలు, పల్లకీలు..అన్నీ ఉన్నాయిట. ఇంక రిస్కు ఎక్కడ లేదు. నున్నగా ఉన్న రోడ్డు మీద నడుస్తున్నా కాలం కలిసిరాకపోతే ఏమైనా జరగవచ్చు''



''మామయ్యగారన్నది రైటే..ఆయన తన స్నేహితులతో సరదాగా వెళ్ళాలనుకుంటున్నారు. అడ్డు చెప్పకండి'' హేమ మామగార్ని బలపరచడంతో మహేష్ తండ్రి యాత్రకి ఒప్పుకున్నాడు.

వెంకట్రామయ్య, పరమేశ్వరయ్య ఇంకో ముగ్గురు ఆ ఊరివాళ్ళు అందరూ కలిసి డాక్టర్ సర్టిఫికెట్స్, ఇన్సూరెన్స్, టికెట్స్ అవీ అన్నీ తయారుచేసి పెట్టుకున్నారు. అమర్‌నాథ్ యాత్రకి బయల్దేరే రోజు కోసం వెంకట్రామయ్య ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాడు. ఆరోగ్యం బాగుండకపోతే మధ్యలో ఆపేస్తారని విని వెంకట్రామయ్య ఇంకా జాగ్రత్తగా ఉంటున్నాడు. ఆరోజు సాయంత్రం పార్కులో వాకింగ్ చేస్తుంటే గిర్రున కళ్ళు తిరుగుతున్నట్టు అన్పించింది. ఒళ్ళంతా సన్నగా చెమటలు. మెల్లిగా పక్కనున్న బెంచీ మీదకి చేరి రెండు నిమిషాలు కళ్ళు మూసుకుని కూర్చున్నాడు. కొంచెం సేపయ్యాక లేచి కుళాయి దగ్గరికి వెళ్ళి మొహం కడుక్కుని రెండు గుక్కలు నీళ్ళు నోట్లో పోసుకున్నాడు. అమర్‌నాథ్ యాత్రకి ఇంకా వారమే సమయం. ఇంతలో ఈ ప్రాబ్లం ఏమిటి? ఎప్పుడూ లేంది. నిస్సత్తువగా నీర్సంగా అనిపించింది. మనసులో ఆందోళన మొదలైంది.

''రావోయ్ ఐరన్ మేన్. ఏమిటి విశేషాలు..ఈమధ్య ఇటువైపు కన్పించడమే మానేశావు బొత్తిగా. విశేషాలేంటి?'' డాక్టర్ రామనాథం, వెంకట్రామయ్యని ఆహ్వానిస్తూ అన్నాడు. రామనాథం, వెంకట్రామయ్య ఒకే ఊరి వాళ్ళు..ఒకే ఈడువాళ్ళు..ఒకే క్లాసులో ఒకే సెక్షన్‌లో ఇద్దరూ ఎస్.ఎస్.సి వరకూ ఒకే స్కూల్లో చదివారు.

''నువ్వేమో బిజీ..నేనొచ్చి నీ పని చెడగొట్టడమెందుకని..''

రామనాథం వయసు మీరాక సొంత క్లినిక్ కావడంతో డాక్టరైన కొడుక్కి సహాయంగా ఉంటాడు. సాయంత్రాలు కొంతమంది బీదవాళ్ళకి ఉచితంగా ట్రీట్‌మెంట్ చేస్తాడు. ''విశేషాలేంటి..మన బ్యాచ్‌లో ఇంకెంతమంది మిగిలారు. ఎంతమంది టపా కట్టేశారు?''

''ఏదో అందరి చిట్టా నా దగ్గర ఉన్నట్టు అడుగుతావేంటి... ప్రస్తుతానికి మనిద్దరం ఇంకా బతికే ఉన్నాం'' వెంకట్రామయ్య మాటలకి రామనాథం హాయిగా నవ్వేశాడు. వెంకట్రామయ్య ఆరోగ్యంగా ఉన్నా ఒంటరితనంతో కొడుకింట్లో ఆదరణ తక్కువై మానసికంగా బాధపడ్తున్నాడని తెలుసు రామనాథానికి.

''ఏమిటి సంగతి? అలసటగా కన్పిస్తున్నావు. ఆరోగ్యం బావుంటోంది కదా''

''బాగుండలేదు కాబట్టే ఇలా వచ్చానయ్యా''

''ఏంటో ప్రాబ్లం..జలుబా? దగ్గా..లేకపోతే రెండుసార్లు తుమ్మి ఉంటావు'' రామనాథం టీజింగ్‌గా అన్నాడు. వెంకట్రామయ్య ఇనుము అనీ అతనికి అంతకంటే పెద్దగా ఏ జబ్బూ రాదని రామనాథం వేళాకోళం చేస్తుంటాడు. ''నేను బతికుండగా ఒక్కసారైనా పేషంట్‌లా నా చేతుల్లో పడకపోతావా'' అని మేలమాడతాడు. వెంకట్రామయ్య పార్కులో కళ్ళు తిరిగిన సంగతి చెప్పాడు. రామ

నాథం వెంకట్రామయ్య బి.పీ., పల్స్ అన్నీ చూసి ఇ.సి.జీ తీయించాడు. వెంకట్రామయ్యలో ఆందోళన పెరిగింది. రామనాథం గంభీరంగా ఉండడం చూసి..ఇ.సి.జీ తీయించడం చూసి-

''ఏంటీ..ఏదైనా ప్రాబ్లమా..'' గంభీరంగా ఉన్న రామనాథం మొహం చూస్తూ అడిగాడు వెంకట్రామయ్య.

''అబ్బే. ప్రాబ్లెం ఏం లేదు. ఇనుము అన్నాక తుప్పు పట్టక మానదు అని అర్థమయింది'' రామనాథం చిన్నగా నవ్వుతూ అన్నాడు.

''సరిగ్గా చెప్పి ఏడవ్వోయ్. నీ మాటలు ఈ లాంగ్వేంజి నాకర్థంకాదు''

''ఏం లేదు అన్నాగా. కాస్త ఉప్పు తగ్గించు. నాలుగు రోజులు నీ కసరత్ మానేసి రెస్ట్‌గా ఉండు. ఇదిగో ఈ మందులు వాడు. ఇవ్వాళ శుక్రవారం, శని, ఆది సెలవు. సోమవారం పొద్దున్నే మళ్ళీ రా..బ్లడ్, యూరిన్ టెస్ట్‌లు ఇంకో రెండు టెస్ట్‌లు చేయిస్తాను. జస్ట్..వయసవుతోందిగా..సేఫ్టీ సైడ్‌గా అన్నమాట. రెస్ట్‌గా ఉండు దట్సాల్.''

వెంకట్రామయ్య అమర్‌నాథ్ యాత్రకి వెళ్దామనుకుంటున్న సంగతి చెప్పాలా వద్దా అని కొంచెం సేపు తటపటాయించి చెప్తే ప్రయాణం కేన్సిల్ చేసుకోమంటాడేమో అని మాట్లాడకుండా ఉండిపోయాడు.

''పెద్ద ప్రాబ్లెం ఏం లేదుగా''

''నథింగ్ రాంగ్..ఉక్కుపిడుగులా ఉన్నావు. డోన్ట్‌వర్రీ..ఏదో బి.పీ, పల్స్ చూస్తేనే అలా తలకిందులైపోతున్నావేంటి..నన్ను చూడు..పదిహేనేళ్ళుగా బీపీ, షుగర్, హార్ట్ ప్రాబ్లం..స్టిల్ గోయింగ్ స్ట్రాంగ్..'' రామనాథం గలగలా నవ్వాడు.

''నీకేంటోయ్ డాక్టరివి. పైగా కొడుకు డాక్టర్..'కూ' అంటే సేవ చెయ్యడానికి కోటి మంది. నాకలా కాదే..టక్కున టపా కట్టెయ్యక పోతే ఇక్కడే నరకం చూసెయ్యాల్సి వస్తుంది'' వెంకట్రామయ్య దిగులుగా అన్నాడు.

''నథింగ్ టు వర్రీ అన్నానా..అయినా నీకు నేను లేనా?..నా నర్సింగ్‌హోమ్ లేదా? మనసు అనవసరంగా పాడు చేసుకోకు'' రామనాథం వెంకట్రామయ్యకు భరోసా ఇవ్వడంతో సోమవారం మళ్ళీ వస్తానని చెప్పి వెంకట్రామయ్య ఇంటికి బయలుదేరాడు.

★ ★ ★

''రండి అంకుల్..రండి..'' మహేష్ డాక్టర్ రామనాథంని సాదరంగా ఆహ్వానించాడు.

''మీ నాన్న ఈమధ్య కన్పించలేదు చాలా రోజులుగా..ఓసారి చూసి వెళ్దామని వచ్చానోయ్'' రామనాథం కుర్చీలో కూర్చుంటూ అన్నాడు.

''నాన్నగారు అమర్‌నాథ్ యాత్రకి వెళ్ళారు నాలుగురోజుల క్రితం..''

రామనాథం ఉలిక్కిపడ్డాడు. ఆరోజు తన క్లినిక్‌కి వచ్చినప్పుడు చెప్పలేదు అమర్‌నాథ్ వెళ్తున్నానని..ఏదో తటపటాయించి మళ్ళీ ఊరుకుండిపోయిన సంగతి గుర్తుకొచ్చింది. వెంకట్రామయ్య..యాత్ర..అదీ తీర్థయాత్ర..రామనాథంకి అనీజీగా అన్పించింది. వెంకట్రామయ్య గురించి చిన్నప్పటి నుంచీ తెలుసు తనకి. దేవీ, దేవతల మీద నమ్మకం లేదు వెంకట్రామయ్యకి. చిన్నప్పుడు అంటే కాస్త ఊహ వచ్చాక తనెప్పుడైనా గుడికి వెళ్ళినా పక్కనే ఉన్న వెంకట్రామయ్య మాత్రం గుడి ముందున్న చెరువులో కాళ్ళు ఆడిస్తూ తనని వెళ్ళి రమ్మనేవాడు. కొద్దికొద్దిగా ఏదో అర్థమవుతోంది రామనాథంకి. ఎన్నో యాత్రలు ఉండగా రిస్క్ ఎక్కువగా వున్న అమర్‌నాథ్ యాత్రకెందుకు వెళ్ళాడో కూడా అర్థమవుతోంది. ఆరోజు ప్రయాణం ఆగిపోతుందనేమో అలా టెన్షన్‌గా కన్పించాడు.

''ఈమధ్య కాస్త ఒంట్లో బావుండటం లేదన్నాడు''

''అలాంటిదేమీ లేదే..మా పెళ్ళయ్యాక మామయ్యగారికి గట్టిగా జలుబు చెయ్యడం కూడా నేను చూడలేదు. ఆరోగ్యం బావుండకపోతే అమర్‌నాథ్ యాత్రకి వెళ్ళేవారు కాదుగా'' హేమ రామనాథంకి కాఫీ కప్పు అందిస్తూ అంది.

పార్కులో కళ్ళు తిరిగిన సంగతి, తన దగ్గరికి వచ్చిన సంగతి ఇంట్లో చెప్పలేదన్నమాట.

''ఫోన్ వచ్చిందా వెళ్ళాక..''

''నిన్ననే ఫోన్ వచ్చింది. శ్రీనగర్ వరకు చేరుకున్నారు. రేపు అమర్‌నాథ్ యాత్ర కోసం అక్కడి దగ్గర్లో ఏదో ఊరికి వెళ్తామన్నారు..''

రామనాథం మనసు భారంగా అయింది. వెంకట్రామయ్య ఆరోగ్యం పైకి కన్పిస్తున్నంత బాగా లేదు. అక్కడ నడక శ్రమకి, చలి వాతావరణం తోడయి ఊపిరి పీల్చుకోవడం కష్టమయినప్పుడు ఈ యాత్ర ఎలా ముగుస్తుంది. కమ్మని పొగలు కక్కుతున్న కాఫీ చేదుకషాయంలా అన్పించింది.

''వస్తాను మహేష్..వస్తానమ్మా హేమా..వెంకట్ మళ్ళీ ఫోన్ చేస్తే నా వైపు నుంచి హేపీ జర్నీ, బెస్టాఫ్ లక్ చెప్పండి'' రామనాథం బయటికి నడుస్తూ అన్నాడు.

కారులో కూర్చున్న రామనాథం మనసు పరి పరి విధాల పోతోంది. వెంకట్రామయ్య యాత్ర వెనక ఏదో నిగూఢ రహస్యం ఉందనిపిస్తోంది. వెంకట్రామయ్య తన యాత్ర ఎలా జరగాలి..ఎలా ముగియాలని కోరుకున్నాడు? తను అతని యాత్ర ఎలా ముగియాలని కోరుకోవాలి?

ఆమధ్య కేరళలో కొంతమంది ముసలివాళ్ళు 'ద రైట్ టు డెత్' అనే ఓ ఉద్యమం మొదలుపెట్టారని విన్నాడు. పేపర్లలో దాని మీద ఎన్నో చర్చలు జరిగాయి. తమ బాధ్యతలు తీరిపోయి ఓ వయసు పరిమితిని దాటాకా తమకి జీవితం 'బోర్' అన్పిస్తున్నప్పుడు మరణం 'హక్కు'గా పొందే చట్టం కల్పించాలని కోరారు. అలాంటప్పుడు ఆరోగ్యంగా ఉన్న వాళ్ళు తమ కళ్ళు, హార్ట్, కిడ్నీలాంటి అంగాలు డొనేట్ చేయడానికి కూడా ఉపయోకరంగా ఉంటుందని సూచించారు.

ఆమధ్య పేపర్లలో రోడ్లు క్రాస్ చేస్తూ ప్రాణాలు పోగొట్టుకున్న ముసలివాళ్ళ గురించి సంఘటనలు గురించి రాస్తూ..వాటిల్లో అన్నీ యాక్సిడెంట్స్ కాకపోవచ్చు. కొన్ని తమ జీవితం ముగించుకోవడానికి ముసలివాళ్ళు తీసుకున్న ఘోర నిర్ణయం కారణం అవచ్చు అన్న సందేహం వెలిబుచ్చాయి. అది ఎంతవరకూ నిజమో..కొంత వరకు నిజమైనా ఆశ్చర్యం లేదు.

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైపోయాక వయసు మళ్ళినవాళ్ళు అటు ఒంటరిగా ఉండే ధైర్యంలేక, ఇటు ఓల్డేజ్ హోమ్‌లో ఉండడం నచ్చక, అలా ఉండడం చిన్నతనంగా భావిస్తూ పిల్లలతో ఉన్నా వాళ్ళతో ఇమడలేక మానసికంగా కృంగిపోతున్నారు. ఉమ్మడి కుటుంబాలు, పెద్దలతో కలిసి ఉండడం అన్న మన పాత పద్ధతులనీ వదిలేశాము.

ఇటు పశ్చిమ దేశాల సంస్కృతినీ అలవాటు చేసుకోలేకపోతున్నాము. అటువంటప్పుడు ఇటువంటి యాత్రలు కాని యాత్రలు..యాక్సిడెంట్స్ కాని యాక్సిడెంట్స్ జరగక తప్పవేమో..

''సార్ నర్సింగ్‌హోమ్ వచ్చింది'' డ్రైవర్ పిలుపుతో ఉలిక్కిపడ్డ రామనాథం భారమైన మనసుతో కిందికి దిగి నర్సింగ్ హోమ్‌లోకి నడిచాడు.

